# భూమి కోసం



సంచిక : 4 మార్చి - 2008

రాష్ట్రంలో భూ సమస్యను అధ్యయనం చేసి పేదలకు భూమిని అందుబాటులోకి తీసుకురావటానికి ఉన్న అవకాశాలను గుర్తించటానికి ప్రభుత్వం కోనేరు రంగారావు అధ్యక్షతన 2004 డిసెంబరులో కమిటీ వేయడం, ఆ కమిటీ సిఫార్సులను ఆమోదిస్తూ ప్రభుత్వం 2007లో రెండు ఉత్తర్వులను జారీ చేయడం తెలిసిందే. ఆ ఉత్తర్వుల కనుగుణంగా ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, జారీ చేసిన మరిన్ని ఉత్తర్వుల వివరాలు ఈ సంచికలో పొందుపరిచాం. అలాగే జనవరి 2008లో నియమాలు జారీ అయి, దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన అటవీ హక్కుల చట్టం పై విశ్లేషణను అందిస్తున్నాం. వివిధ సంఘాలు, కార్యకర్తలు పనిచేస్తున్న ఆయా గ్రామాలు/మండలాల్లో కమిటీ సిఫార్సులు, సంబంధిత ఉత్తర్వులు, అటవీ హక్కుల చట్టం అమలు తీరును అర్థం చేసుకొని పేదలకు భూమిపై హక్కులు సాధించటంలో ఈ సంచికలోని వివరాలు ఉపయోగపడతాయని ఆశిస్తున్నాం.

## కోనేరు కమిటీ సూచనలు అమలవుతున్న తీరు

డిసెంబరు 2004లో ఏర్పడిన కోనేరు రంగారావు కమిటీ తన నివేదికను దాదాపు రెండు సంవత్సరాల తరువాత నవంబరు 2006లో సమర్పించింది. ఇందులో 104 సూచనలు చేయగా ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్.నం. 1049 ద్వారా 74 సూచనలు, జి.ఓ.ఎం.ఎస్.నం. 1191 ద్వారా మరో 18 (2 సూచనలను పరిశీలనకు ఉంచారు) సూచనలను సెప్టెంబర్ 2007 నాటికి ఆమోదించింది. వీటి అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించ డానికి 3 కమిటీలను కూడా నియమించింది. భూ పరిపాలన చీఫ్ కమీషనర్ (సిసిఎల్ఎ) పర్యవేక్షణలో ఒక ప్రత్యేక కమీషనరును కూడా ఇందుకోసం నియమించారు.

2008 జనవరి 7 నుండి 10 తేదీలలో రెవెన్యూ మంత్రివర్యుల అధ్యక్షతన జిల్లా కలెక్టర్ల ప్రాంతీయ సదస్సులు జరిగే నాటికి ఆమోదించిన 92 సిఫార్సులకు గాను 22 సిఫార్సులకు క్షేత్రస్థాయి ఆదేశాలు వెళ్ళాయి. వాటి వివరాలు, విశ్లేషణ పాఠకులకు అందిస్తున్నాం. పేదల భూ సాధనకు పనిచేస్తున్న సంఘాలు, కార్యకర్తలకు ఆయా సమస్యలకు సంబంధించి పేదలకు అవగాహన కల్పించడంలో, అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఉత్తర్వులు అమలయ్యేలా చేయడంలో ఈ వివరాలు ఉపయోగపడతాయని ఆశిస్తున్నాం.

### 1. అసైన్‌మెంట్ భూములు

**సూచన సంఖ్య, సూచన:** 1.1, ప్రభుత్వ భూమి పేదలకు ఇవ్వటానికి గ్రామసభలలో లబ్ధిదారుల ఎంపిక

**ఉత్తర్వుల వివరాలు:** CCLAs Ref. No. B1 / 2127/2007 - 6-10-07, గ్రామంలో వున్న వారందరిని సమావేశానికి రమ్మని విఆర్ఓ పిలుస్తారు. ఎంత మంది వస్తే అదే గ్రామసభగా

పరిగణించవచ్చు.

**రిమార్కులు:** ఇది గ్రామ సభకు కొత్త అర్థం. గత నాలుగు విడతల భూ పంపిణీలో ఎక్కడా గ్రామ సభలు పెట్టలేదు

**సూచన సంఖ్య, సూచన:** 1.5, అసైన్‌మెంట్ భూమి కోసం దరఖాస్తు పరిష్కారానికి కాలపరిమితి ఉండాలి. దరఖాస్తు వచ్చిన మూడు నెలలలోగా పట్టా మంజూరు చేయాలి. అలా చేయకపోతే అందుకు కారణాలు తెలియపరచాలి.

**ఉత్తర్వుల వివరాలు:** Memo No. 44677/ASN.POT (2)/ 2007-1/24-907, పట్టాల మంజూరీకి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

**రిమార్కులు:** మూడు నెలల కాలపరిమితి మాత్రం విధించలేదు. విడతల వారీ భూ పంపిణీ కోసం తయారైన పట్టాలనే ఇవ్వటం లేదు. తిరస్కారమైన అర్జీలకు జవాబు బిఎస్ఓలో వుంది




**సూచన సంఖ్య, సూచన:** 1.10, గ్రామస్తులతో బృందం ఏర్పాటు చేసి గ్రామంలో ఉన్న మొత్తం ప్రభుత్వ భూములను గుర్తించి నమోదుచేయాలి (ఫిజికల్ ఇన్‌వెంటరీ). దీనికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కమిటీ చెప్పింది.

**ఉత్తర్వుల వివరాలు:** 27-10-07న ఇచ్చారు. ప్రతి మండలానికి 2 బృందాలను విధిగా నియమించాలి. వీటిల్లో ఆర్ఐ, విఆర్ఓ, సర్వేయరు వుండాలి. 5 నుండి 6 రోజులు ఒక గ్రామానికి సరిపోతుంది.

**రిమార్కులు:** మండలాలలో సిబ్బంది కొరత గురించి ప్రస్తావన లేదు. ప్రభుత్వ భూముల ఆక్రమణ గుర్తింపు, నమోదు, తొలగింపు ఎప్పుడో ఆపేసారు. విఆర్ఓలకు దీనిపై శిక్షణ లేదు. సర్వేయర్లు కొరత ఉంది. మండలానికి ఒకరు కూడా లేని పరిస్థితిలో మండలానికి రెండు బృందాలు ఎలా వేస్తారు?

## 2. భూమి రికార్డులు/ పట్టాదారు పాసు పుస్తకాలు

**సూచన సంఖ్య, సూచన:** 2.5, పాస్ పుస్తకం ఇచ్చిన్పపుడే అన్ని రికార్డులలో మార్పులు

**ఉత్తర్వులు:** CCLAs Ref. No. ROM /ROR1/ 425/ 2007 - 15-8-07, పాసు పుకాలు ఇచ్చినప్పుడే రెవెన్యూ రికార్డులలో మార్పు చేయాలి

**రిమార్కులు:** ప్రస్తుతం ఇలా ఎందుకు జరగటం లేదు, అందుకు వ్యవస్థాగతమైన సమస్యలేమిటి అన్న ప్రస్తావన లేదు. వాటికి పరిష్కారాలు చూపించలేదు.

**సూచన సంఖ్య:** 2.6, పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్‌లలో అసైన్‌మెంట్ భూమి అని రాయాలి

**ఉత్తర్వులు:** CCLAs Ref. No. Rom / ROR1/ 425/ 2007 - 15-8-07, సూచన యధాతథం

**రిమార్కులు:** ఇప్పటికే ఈ విధంగా రాస్తున్నారు, దీనివల్ల కొత్తగా ఒరిగేది ఏమిలేదు.

**సూచన సంఖ్య, సూచన:** 2.9, పట్టాదారు పాస్ పుస్తకాలకు/ టైటిల్ డీడ్‌లకు సీరియల్ నెంబర్లు ఇవ్వాలి

**ఉత్తర్వులు:** CCLAs Ref. No. ROM /ROR1/ 425/ 2007 - 15-8-07, 90 శాతం భూములకు పిపిబి/టిడిలు ఇచ్చేశాం, వాటిని వెనక్కి పిలిచి నెంబర్లు వేయాలి. అప్పుడే బోగసు పాస్ పుస్తకాలను గుర్తించి సరైన అధికారి ద్వారా రద్దు చేయాలి. నెంబర్లు ఎలా ఇవ్వాలి? అది ఎలా పనిచేస్తుంది అనేది కలెక్టర్లే నిర్ణయించాలి

**రిమార్కులు:** జిల్లా, డివిజన్, మండలం, గ్రామాలలో అమలు తీరు రూపొందించే బాధ్యత కలెక్టర్ల మీద వదిలేశారు.

## 3. ఇనాం భూములు (తెలంగాణా)

**సూచన సంఖ్య, సూచన:**

8.1, సెటిల్‌మెంట్ కాని ఇనాం భూముల పరిశీలన

8.2, ఇనాం భూములకు ఓఆర్‌సి మంజూరు,

8.4, నిజమైన ఇనాందారు సాగుదార్ల గుర్తింపునకు గ్రామసభలు

**ఉత్తర్వులు:** CCLAs Ref.No.v1/ 434/ 2007/ 22-11-07 (కోనేరు సూచనలు 8.1, 8.2, 8.4లకు ఒకే ఆదేశం)

**వివరణ:** 1. ఇనాం భూమి రిజిస్టర్లను సంపాదించాలి. ఒకవేళ అది దొరకకపోతే తేది. 29.10.76న ఇచ్చిన జి.ఓ.ఎం.ఎస్. నెం.1159 ద్వారా రూపొందించిన 24 కాలమ్స్ ఇనాం భూముల ప్రొఫార్మాను చూడాలి. ఒక వేళ అది కూడా దొరకకపోతే, సేత్వార్, ఖాస్రా పహాణి/ చెస్లా పహాణి, పైసల్ పట్టీల నుండి వివరాలు సేకరించాలి. వీటినుండి ఇదివరకే ఓఆర్‌సిలు ఇచ్చిన ఇనాం భూములను మినహాయించాలి.

2. తాశీల్దారు, డిప్యూటీ తాశీల్దారు, రెవెన్యూ ఇన్స్‌పెక్టరు, మండల సర్వేయరు, విఆర్ఓలతో విచారణ బృందాలను నియమించాలి. వీరు గ్రామసభలు నిర్వహించి నివేదికలను ఆర్‌డిఓకు పంపాలి.

3. ఆర్‌డిఓలు విచారణ జరిపి నిబంధనల ప్రకారం అర్హులైన వారికి ఓఆర్‌సిలు మంజూరు చేయాలి.

తెలంగాణ జిల్లాలకు చెందిన అందరు కలెక్టర్లు 2007 చివరికల్లా మిగిలిపోయిన ఇనాం భూములకు ఓఆర్‌సిలు మంజూరు చేసి ఈ సమస్యను పూర్తి చెయ్యాలి.

**రిమార్కులు:** ఆదేశాలు ఇచ్చిందేమో నవంబరు 22వ తేదీ, మొత్తం పని పూర్తి చేయాలని చెప్పింది 2007 చివరికి అంటే 43 రోజులలో !!

## 4. ఆదివాసీ భూమి సమస్యలు

**సూచన సంఖ్య, సూచన:** 9.15, ఎల్‌టిఆర్ కేసులో ఆదివాసీలకు అనుకూలంగా ఇచ్చిన తీర్పులను వెంటనే అమలు పరచడం

**ఉత్వర్వుల వివరాలు:** CCLAs Ref.No.L1/ 282/07/ 22-11-07, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు. అదే ఉత్తర్వులు ఇతర జిల్లాలకు వర్తిస్తాయి. ఎల్‌టిఆర్ కేసులో తీర్పులో వచ్చిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి

**రిమార్కులు:** ఖమ్మం, వరంగల్ జిల్లాలో కోనేరు కమిటి కొన్ని



నిర్దిష్టమైన కేసులను పేర్కొంది. వాటిని 90 రోజులలో పూర్తి చేయాలని, ప్రతి వారం ప్రగతిని నివేదించాలని ఆదేశించారు. 2వ ఉత్తర్వు ద్వారా ఎల్‌టిఆర్ కేసులలో ఆదివాసీలకు అనుగుణంగా తీర్పురాగానే వెంటనే అమలు పరచాలని, ఇప్పటికే ఆదేశాలు వచ్చిన కేసులలో 2 నెలల్లో భూమి అప్పగించాలని ఆదేశించారు. కార్యకర్తలు ఆయా కేసుల వివరాలను జిల్లా కలెక్టరు, పిఒ, ఐటిడిఎల నుంచి సేకరించి ఉత్తర్వుల అమలుకై హక్కుదారుల ద్వారా ఒత్తిడి తేవాలి.

**సూచన సంఖ్య, సూచన:** 9.24, సర్వే చేసి నెంబరు ఇవ్వని (బిల్ల నెంబరు) భూములలో వున్న గిరిజనేతరులను తొలగించాలి.

**ఉత్తర్వులు:** CCLAs Ref.No.L1/ 288/ 2007/ 22-10-07

**వివరణ:** సర్వే చేసి నెంబరు ఇవ్వని (బిల్ల నెంబరు) భూములు గిరిజనేతరుల స్వాధీనంలో వున్నాయని కమిటీ గుర్తించింది. ముఖ్యంగా ఖమ్మంజిల్లా కొత్తగూడెంలోనే 21,000 ఎకరాల భూమి ఈ విధంగా వుందని పేర్కొంది. వీటిని 90 రోజులలో స్వాధీనం చేసుకొని ఆదివాసీలకు పంచాలని ఉత్తర్వులలో ఆదేశించారు. ఇతర జిల్లాల కలెక్టర్లు దీనిని అమలుపరచాలని ఆదేశించారు.

**సూచన సంఖ్య, సూచన:** 9.26, పరారీ పట్టాదార్లు, జంగ్ సిఫాయి, అజబ్ సింగ్ భూములు

**ఉత్తర్వుల వివరాలు:** CCLAs Ref. No. L1 /289/ 2007-13-10-07, నిజాం నవాబు కొందరు సైనిక అధికారులకు పట్టాలిచ్చారు. వాటి పట్టాదార్లు / వారసులు లేరు. వీటిని గత 60 సంవత్సరాలుగా గిరిజనులే సాగు చేస్తున్నా వారి పేర్లు రికార్డులలో లేవు. ఈ భూములలో ఆదివాసీలుంటే పట్టాలు ఇవ్వాలి. ఆదివాసేతరులు వుంటే తొలగించి స్వాధీనం చేసుకోవాలి.

**రిమార్కులు:** ఈ ఉత్తర్వులు ఖమ్మం, వరంగల్ కలెక్టర్లకు ఉద్దేశించినవి. కార్యకర్తలు ఇటువంటి భూములను గుర్తించి ఈ ఉత్తర్వులు అమలు జరిగేందుకు ప్రయత్నించాలి

**సూచన సంఖ్య, సూచన:** 9.27, గిరిజనేతరులకు అనుకూలంగా ఆదివాసీలకు వ్యతిరేకంగా భూ విషయాలలో పోలీసులు జోక్యం చేసుకోకూడదు

**ఉత్తర్వులు:** Memo. No. 695/250 -1/2007/31-10-07

**వివరణ:** డైరెక్టరు జనరల్ ఆఫ్ పోలీసు వారి నుండి అన్ని జిల్లాల / యూనిట్ అధికారులకు ఒక ఏక వాక్య తాఖీదు వెళ్ళింది. 'గిరిజనులకు వ్యతిరేకంగా, గిరిజనేతరులకు అనుకూలంగా జోక్యం చేసుకోవద్దు'. అక్కడితో వారి బాధ్యత తీరిపోయింది.




**సూచన సంఖ్య, సూచన:** 9.28, షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఆదివాసేతరులకు అనుకూలంగా రిజిస్ట్రేషన్లు చేయకుండా వుండటం

**ఉత్తర్వుల వివరాలు:** Government No. 50834/ASS.POT (2) 2007, Revenue (Assgn.pot) dt.6.10.2007, circular Memo. G1/13814/2007, date 21.9.07, కమీషనర్, ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్స్, జిల్లా రిజిస్ట్రార్లకు పంపిన పై

సర్క్యులరులో ఎపిఎల్‌టిఆర్ చట్టం సెక్షన్ 3-బి, గతంలో ఇచ్చిన రెండు మెమోలను(No.1620/ఏ2/07-1, 1-6-87, No. G1/21683/88, date 15.9.88) పేర్కొని చట్టాన్ని, నియమాలను జాగ్రత్తగా పాటించాలని కోరారు.

**రిమార్కులు:** ఉన్న చట్టాలను, సిబ్బంది విధిగా చేయవలసిన పనులను తిరిగి గుర్తుచేయడం వరకే పరిమితం

**సూచన సంఖ్య, సూచన:** 9.29, ఖమ్మం జిల్లా ఎల్‌టిఆర్ కేసులపై సమీక్ష

**ఉత్తర్వు:** అందుబాటులో లేదు

**సూచన సంఖ్య, సూచన:** 9.31, ఆదివాసేతరుల వద్దవున్న హక్కుదారు పట్టాలను రద్దు చేయాలి

**ఉత్తర్వుల వివరాలు:** CCLAs Ref. No. L1 /379/2007 - 24-10-07, నిజాం నవాబు ఇచ్చిన హక్కుదారు పట్టాలంటు కొందరు ఫోర్జరీ ఫర్మానాలను సృష్టించారు. రెవెన్యూ రికార్డులలోను, ఈ ఫర్మానాలను పరిశీలించాలి. భూ అన్యాక్రాంత నిషేధ చట్టం కింద అనర్హులైన గిరిజనేతరులపై కేసులు నమోదు చేయాలి.

## 5. భూ సంస్కరణలు

**సూచన సంఖ్య, సూచన:** 4.11, భూ సంస్కరణల చట్టం సెక్షన్ 10 అమలు గురించి

**ఉత్తర్వు వివరాలు:** Memo.No. 50155/ L. Ref. 07-1/16-11-2007

**రిమార్కులు:** భూ సంస్కరణల ట్రిబ్యునల్ సీలింగు మిగులు నిర్ధారణ చేసిన వెంటనే, ఆలస్యం లేకుండా, డిక్లరెంట్లు అప్పీలుకు వెళ్ళే అవకాశం ఇవ్వకుండా మిగులు భూములను స్వాధీనం చేసుకోవాలని వాటిని ఆర్‌డిఓ/తాశీల్దార్లు అమలు పరచాలని ఈ ఉత్తర్వు అంటుంది. అసలు కేసుల విచారణే లేకపోతే ఇక సీలింగు మిగులు ఎక్కడ?

**సూచన సంఖ్య, సూచన:** 4.14, భూ సంస్కరణల చట్టంలోని సెక్షన్ 18 అమలు గురించి

**ఉత్తర్వు వివరాలు:** Memo.No.53449/L.Ref.2007-1/date 2.12.2007, పెళ్ళి, దత్తత, కొనుగోలు వంటి పద్ధతుల ద్వారా కొత్తగా భూమి సమకూరినప్పుడు, వర్గీకరణ మార్పు వల్ల భూ విస్తీర్ణం పెరిగినప్పుడు సెక్షన్ 18 కింద మళ్ళీ డిక్లరేషన్ సమర్పించాలి.

**రిమార్కులు:** వివిధ రూపాలలో భూమి కొత్తగా సమకూరినా లేక ఉన్న విస్తీర్ణం పెరిగినా భూ యజమాని మళ్ళీ డిక్లరేషన్ ఇవ్వాలి. అదేవిధంగా జలయజ్ఞం వల్ల నీటి సదుపాయం కలిగినప్పుడు మెట్టు (కుష్కి) భూమి పల్లం (తరి) భూమిగా మారుతుంది. తద్వారా సీలింగు చట్టం అనుసరించి భూ విస్తీర్ణం మదింపు పెరుగుతుంది. కాని ఎవరూ ఇటువంటి డిక్లరేషనులు వేయటం లేదు. దీనిపై తగిన చర్యలు తీసుకొని ప్రతినెల 5వ తేదీన సిఎల్ఎల్ఎ కార్యాలయానికి జిల్లా కలెక్టర్లు నివేదికలు పంపాలి.

**సూచన సంఖ్య, సూచన:** 4.15, భూ సంస్కరణల చట్టం సెక్షన్



19ని ఖచ్చితంగా అమలు పరచాలి.

**ఉత్తర్వు వివరాలు:** Memo.No.50155/L.Ref 7-1/16.11.07, భూములు అమ్మే వాళ్ళు, కొనేవారు విధిగా ఫారం XIV ని రిజిస్ట్రారు ముందు దాఖలు చేయాలి.

పై ఉత్తర్వును రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమీషనరు రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ వారికి పంపగా వారి నుండి రిజిస్ట్రార్లకు ఇంకా ఉత్తర్వులు వెళ్ళలేదు.

**రిమార్కులు:** భూముల క్రయ విక్రయాల సమయంలో ఆర్‌డిఓ / భూ సంస్కరణల ట్రిబ్యునల్ నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్స్ విధిగా దాఖలు చేయాలి. సీలింగు డిక్లరేషన్ ఇచ్చారా, అది మిగులు భూమి తేలిన కేసా కాదా, అని అధికారులు విచారణ చేయడానికి వీలవుతుంది.

రిజిస్ట్రేషన్ సమయంలో భూ సంస్కరణల ట్రిబ్యునల్ నుండి ఫారం XIV డిక్లరేషన్ విధిగా తేవాలని సబ్ రిజిస్ట్రార్లు పార్టీలను అడగవలసి ఉంటుంది. ఈ సూచన ఖచ్చింతగా రిజిస్ట్రేషన్‌లను మందగింపచేయడంతో పాటు రెవెన్యూ అధికారులకు ఆదాయంగా మారుతుంది. అందుచేతనే కమీషనరు రిజిస్ట్రార్లకు ఆదేశాలు పంపలేదు.




## 6. వివిధ స్థాయిల్లో కోర్టుల నిర్వహణ, ఆదేశాల అమలు

**సూచన సంఖ్య, సూచన:** 10.2, రెవెన్యూ కోర్టులను క్రమం తప్పకుండా నిర్వహించడం

**ఉత్తర్వులు:** లభించలేదు

**వివరణ:** రెవెన్యూ అధికారులు కార్యనిర్వాహక (ఎగ్జిక్యూటివ్) న్యాయమూర్తులు కూడా. వీరి కోర్టులలో దాఖలైన కేసులు సంవత్సరాల తరబడి విచారణ జరగకుండా వుంటున్నాయి. రెవెన్యూ కోర్టులను సక్రమంగా నిర్వహిస్తూ కేసులు పరిష్కరించాలని కోనేరు కమిటీ 10.2లో సూచించింది.

**సూచన సంఖ్య, సూచన:** 10.3, ఆర్‌డిఓ/ఎమ్మార్వోలు తమవద్ద వున్న కేసుల విచారణకు గ్రామ కోర్టులను నిర్వహించాలి.

**ఉత్తర్వుల వివరాలు:** CCLAs Ref.No. సి1 1024/2007, 26.9.07, తమ వద్ద పెండింగులో వున్న కేసుల విచారణను గ్రామాలలో నిర్వహించాలి.

**వివరణ:** జాయింట్ కలెక్టరు, ఆర్‌డిఓ, తాశీల్దార్లు తమ వద్ద వున్న కేసుల వివరాలను తయారు చేసి వివాదం వున్న గ్రామాలలో కోర్టులు నిర్వహించడానికి తేదీల వారీగా జాబితా తయారు చేసుకోవాలి. పార్టీలందరికి వివరాలు పంపాలి. కిందిస్థాయి అధికారులు కోర్టులు నిర్వహిస్తుంది లేనిది జెసి/ కలెక్టర్లు పర్యవేక్షించాలి. ఇది బ్రిటిష్ కాలం నుండి వున్న సాంప్రదాయం. దీన్ని ప్రతిపాదనలు చాలా అయ్యింది.

**సూచన సంఖ్య, సూచన:** 10.4, ఆయా శాఖల కోర్టు కేసులను ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టరు సమీక్షించాలి.

**ఉత్తర్వులు:** లభించలేదు

**వివరణ:** ప్రభుత్వంలోని వివిధ శాఖలపై దాఖలైన కేసుల విషయంలో కూడా చాలా అశ్రద్ధ ఏర్పడింది. సకాలంలో కౌంటర్లు వేయకపోవడం, సాక్ష్యాలు అందచేయకపోవడంతో ప్రభుత్వం కేసుల్లో విఫలమవుతోంది. దీనిపై రంగారావు కమిటీ 10.4 సూచన చేసింది.

## డిసెంబరు 2007 నుండి మార్చి 2008 వరకు వెలువడిన ఉత్తర్వుల వివరాలు (క్లుప్తంగా)

1. పేదలకు సీలింగు మిగులు భూముల పంపిణీకి సంబంధించిన కార్యనిర్వాహక ఆదేశాలు, మెమో నెం. 53444/L.Refs/2007-2, తేది. 12.12.2007 (సూచన సంఖ్య: 4:5). ఒక వ్యక్తికి అప్పటికే ఉన్న భూములతో కలుపుకొని ఒక ఎకరా పల్లం, లేదా రెండు ఎకరాల మెట్టకు మించకూడదు అన్న సూచనకు కట్టుబడకుండా ఆయా గ్రామాలలో భూముల లభ్యత, అర్హులైన పేదల సంఖ్యను బట్టి పూర్తిగా భూమిలేని పేదలకు ప్రాధాన్యతను ఇస్తూ భూ పంపిణీ జరగాలి.

2. భూ సంస్కరణల ట్రిబ్యునల్ నందు పెండింగ్‌లో ఉన్న సీలింగు భూముల వాజ్యాల గురించి గవర్నమెంటు ప్లీడర్‌తో, జాయింట్ కలెక్టరు నిరంతర సమీక్ష జరపాలని ఆదేశాలు, తేది: 12.12.2007న మెమో నెం. 53451/L. Refs/ 2007-2 (సూచన సంఖ్య - 4.7)

3. అన్ని కోర్టులలో (భూ సంస్కరణల ట్రిబ్యునల్ నుండి సుప్రీంఓర్టు వరకు) సీలింగు భూముల కేసులను వాదించుటకు భూ సంస్కరణల అధీకృత అధికారికి తగిన ఆదేశాలు, తేది: 12.12.2007, మెమో నెం. 53450/L.Refs/2007-2) (సూచన సంఖ్య: 4.10)

4. భూ సంస్కరణల చట్టం, సెక్షన్ 10 ప్రకారం సీలింగు మిగులు భూముల స్వాధీనానికి సంబంధించి న్యాయపరమైన ప్రక్రియలను పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు, తేది: 10.1.2008, మెమో నెం. 50154/L.Refs. 2007-1 (సూచన సంఖ్య - 4.9)

5. తహశీల్దారు/ రెవెన్యూ డివిజనల్ అధికారి/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో యువకులైన డైరెక్ట్ రిక్రూట్స్‌ని నియమించాల్సిందిగా ఆదేశాలు. తేది: 30.1.2008, జి.ఓ.96 (సూచన సంఖ్య - 9.3, 8.9, 3.9)

6. అలాగే ఏజెన్సీ ప్రాంతాలలో భూ బదలాయింపు నియంత్రణ



చట్టంపై శిక్షణ ఇచ్చిన తరువాత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా నియమించాలి.

7. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను నిషేధ్నాల పుస్తకంలో నమోదు చేయటానికి ఆదేశాలు, తేది: 1.12.07, జి.ఓ.ఎం.ఎస్.నెం. 1493 (సూచన- 1.7)

8. ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాసు పుస్తకాల చట్టం, 1989, నిబంధనల 22 (2) కింద దరఖాస్తులకు గడువు పెంచుతూ ఆదేశాలు, తేది: 1.12.07, జి.ఓ.ఎం.ఎస్.నం.1493 (సూచన సంఖ్య -2.1)

9. ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాసు పుస్తకం చట్టం, నిబంధన 22(4) కింద సాదా కాగితం మీద చేసుకున్న అమ్మకపు ఒప్పందాల క్రమబద్ధీకరణపై ఉత్తర్వులు, తేది: 30.1.08, జి.ఓ.ఎం.ఎస్.నెం. 95 (సూచన సంఖ్య- 2.2)

10. పేదలకు భూ పంపిణీ అవకాశాలు పెంచటానికి తగిన మార్గాలను అన్వేషించటానికి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు, తేది: 17.1.2008, మెమో నెం.65764/ Asn.POT(2)/2007-1 (సూచన సంఖ్య -12.1)

11. భూమి హక్కు పత్రం నకలును జారీ చేయటానికి వసూలు చేసే మొత్తాన్ని రూ. 1000 నుండి 100 రూపాయలకు తగ్గిస్తూ చట్ట సవరణకు ఆదేశాలు, తేది: 18.2.2008, జి.ఓ.ఎం.ఎస్.నెం.171

12. ఏజెన్సీ (షెడ్యూల్డ్) ప్రాంతంలోని ప్రభుత్వ భూముల నుండి గిరిజనేతుల తొలగింపునకు ఏ విధమైన అడ్డంకులు లేవని, రిట్ పిటిషన్ నెం. 1755/1980లో 5.12.1984న హైకోర్టు తీర్పు దీనికి అనుకూలంగా ఉందని, కావున ప్రభుత్వ భూముల నుండి గిరిజనేతరులను తొలగించవచ్చని సిసిఎల్ఏ, జిల్లా కలెక్టర్లకు రాసిన లేఖ, (CCLAs Ref.No. L1/283/07, (సూచన సంఖ్య- 9.16)

13. ఇంటిస్థలాల (హోమ్‌స్టెడ్) చట్టం, 1976 పై పేదలలో విస్తృత అవగాహన కల్పించటానికి చర్యలను సూచిస్తూ ఆదేశాలు, తేది: 27.2.2008, మెమో నెం.7278/ Asn.POT(2)/2008. (సూచన సంఖ్య- 5.2)

14. భూమి బదలాయింపు నియంత్రణ చట్టంకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలపై ఆదేశాలు, తేది: 28.7.2007, మెమో నెం.11456/ T.W.LTR 1/06, (సూచన సంఖ్య - 9.2)

15. ఏజెన్సీ ప్రాంతాలలోకి గిరిజనేతరుల వలసలను/ చొరబాట్లను నియంత్రించడానికి వివిధ శాఖలు చేపట్టవలసిన చర్యలపై ఆదేశాలు, తేది: 28.2.08, మెమో నెం. 11456/ T.W.LTR 1/06, (సూచన సంఖ్య - 9.41)

17. షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనేతరులకు 1950కి ముందు ఇచ్చిన పట్టాలను పరిశీలించి అవి సరియైనవో కాదో నిర్ణయం చేయాల్సిందిగా ఆదేశాలు, తేది: 28.2.2008, మెమో నెం.11456/ T.W.LTR 1/06 (సూచన సంఖ్య - 9.9)

18. సాగు లెక్కల పుస్తకంలో/అడంగల్/పహానీలలో నిజమైన సాగుదారుల/ కౌలుదార్ల పేర్లు నమోదు చేయాల్సిందిగా ఆదేశాలు, తేది: 18.2.08, జి.ఓ.ఎం.ఎస్.నం.172, (సూచనల సంఖ్య - 6.2, 6.3, 9.35)

19. భూమి రికార్డులు, ఎల్‌టిఆర్ కేసులకు సంబంధించిన గ్రామస్థాయిలో తీర్పులు గిరిజనులకు ఉచితంగా అందచేయటానికి తగిన చర్యలకు ఆదేశాలతో సిసిఎల్ఏ లేఖ CCLAs Ref.No.L1/296/2007, తేది: 3.3.2008 (సూచనల సంఖ్య - 9.36)

20. వరంగల్ జిల్లాలో (ముఖ్యంగా గోవిందరావుపేట, ములుగు మండలాల్లో) గిరిజనేతరుల ఆక్రమ ఆక్రమణలను తొలగించటానికి తగిన చర్యలపై ఆదేశాలతో సిసిఎల్ఏ లేఖ, CCLAs Ref.No.L1/287/2007

21. భూ బదలాయింపు నియంత్రణ చట్టంలోని అంశాలను ఉల్లంఘిస్తూ గిరిజనేతరులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన కేసులలో ఆయా న్యాయస్థానాలలో తిరిగి అప్పీలు దాఖలు చేయాల్సిందిగా ఆదేశాలు, తేది: 7.3.08, మెమో నెం. 11456/ T.W.LTR.1I06 ❑

# అటవీ హక్కుల చట్టం - సందేహాలు, సమస్యలు

- పి.ఎస్. అజయ్‌కుమార్




షెడ్యూల్డ్ తెగలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల హక్కుల బిల్లు 2007 జనవరి 2న భారత ప్రభుత్వపు రాజపత్రంలో ప్రచురితం కావడంతో 'బిల్లు' (2006) చట్టంగా మారే ప్రక్రియ పూర్తి అయ్యింది. ఈ చట్టం అమలుకు నియమాలు (రూల్సు) రూపొందించి, రాజపత్రంలో ప్రకటితం అయ్యే వరకు చట్టం అమలు కాదు. ఇందుకోసం ప్రభుత్వం ఎస్.ఆర్. శంకరన్ అధ్యక్షతన ఒక కమిటీని వేసింది. చట్టం అమలులోకి వచ్చిన ఒక సంవత్సరానికి 2008 జనవరి 1న నియమాలు ప్రకటితం అయ్యాయి. 2006 బిల్లు, 2007లో చట్టంగా మారి 2008 నుండి అమలులోకి వచ్చిందన్న మాట.

ఒక బిల్లును చట్టంగా మార్చి అమలులోకి తేవడానికి ఇంత సమయం తీసుకున్నవారు, అది అమలులోకి వచ్చిన తరువాత పనులు మొదలు పెట్టి పూర్తి చేయించడానికి మాత్రం విపరీతమైన తొందర చూపిస్తున్నారు. ఈ వేగం ఎంతగా వుందంటే చట్టాన్ని అమలు పరచడానికి ఉద్యమాలు చేసిన వారు సహితం 'అంత తొందర' వద్దని మొత్తుకోవలసి వస్తోంది. ఈ తొందరికి అసలు కారణం హక్కులు నిర్ధారణ కాదు, రేపు రాబోతున్న ఎన్నికలు.

దీనివల్ల వచ్చే సమస్యలను చర్చించే ముందు చట్టం, దానిలో విశేషాల గురించి సంక్షిప్తంగానైనా ప్రస్తావించుకుందాం. చట్టంలో మొత్తం ఆరు అధ్యాయాలు ఉన్నాయి. అధ్యాయం వారీగా సమస్యలను, వివరాలను ఈ కింద ఇస్తున్నాం.

## మొదటి అధ్యాయం - నిర్వచనాలలో సమస్యలు

చట్టంలో ఉపయోగించిన పదాలకు మొదటి అధ్యాయం నిర్వచనాలు చెపుతుంది. ఉదాహరణకు అటవీ గ్రామం అంటే ఏమిటి, సాంప్రదాయక అటవీ వనరులు, గ్రామసభ, ఆవాసం, అటవీ నివాసులంటే ఎవరు మొదలైన వాటికి నిర్దిష్ట నిర్వచనాలు.

చట్టాన్ని 'షెడ్యూల్డ్ తెగలు, సాంప్రదాయ అటవీ నివాసుల హక్కుల చట్టం' అని పేరు పెట్టి, సాధారణ అర్థంలో షెడ్యూల్డ్ తెగ అనే మాటను నిర్వచనాలలోకి వచ్చే సరికి 'అటవీ నివాస షెడ్యూల్డ్ తెగలు అని ప్రత్యేకంగా పేర్కొని నిర్వచించింది. భవిష్యత్తులో అటవీ భూముల హక్కుల విషయంలో ఇది తీవ్ర వివాదాస్పదం కావడానికి అవకాశం వున్నందున కాస్త వివరంగా చర్చించుకుందాం.

సాధారణ అర్థంలో ఆదివాసీలు / గిరిజనులు అంటే కొండలు / అడవులలో జీవించేవారని భావిస్తాం. చట్టంలో అటవీ నివాస షెడ్యూల్డ్ తెగలు అని ప్రయోగించడంలో ఒక ప్రత్యేక ఉద్దేశం వుందని నిర్వచనాన్ని చూస్తే తెలుస్తుంది. ఈ నిర్వచనంలోని పదాలే రేపు ప్రజలు, అటవీశాఖ, ఆదివాసీ సంక్షేమ సంస్థల మధ్య వివాదాన్ని ఆవిష్కరించనున్నాయి. అటవీ నివాస షెడ్యూల్డ్ తెగలు అంటే అడవి లో నివశిస్తూ హేతుబద్ధమైన జీవన అవసరాలకు దానిపై ఆధారపడిన వారు అని చట్టం నిర్వచించింది. ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత గిరిజన సంక్షేమ శాఖ, సిపిఎం పార్టీ వారి గిరిజన సంఘం, స్వచ్ఛంద సంస్థలు చేసిన అనువాదాలు in the forest and అనే మాటలను 'అడవి లోపల లేదా అడవిపై' అని తెలుగు అనువాదం చేశాయి. and (మరియు) అనే మాటను or (లేదా అనే అర్థంలో తీసుకున్నాయి. అటవి శాఖ ఇది తప్పని అంటుంది. పదం చిన్నదే గాని లక్షల మంది జీవితాలను అది ప్రభావితం చేయనుంది. ఈ చర్చను పూర్తి చేయడానికి ముందు అటవీ భూమి అంటే (చట్ట ప్రకారం) ఏమిటో చూద్దాం.




**అటవీ భూమి నిర్వచనం:**

ఈ చట్టం సెక్షన్ 2 (డి) ప్రకారం 1. ఇంకా వర్గీకరించని, సరిహద్దులు 2. ఇంకా నిర్ధారించని/ అడవులు 3. ఇంకా గుర్తించబోతున్న (డీమ్డ్), 4. రక్షిత (ప్రొటెక్టడ్), 5. రిజర్వు అడవులు 6. వన్య మృగ సంరక్షణ కేంద్రాలు 7. జాతీయ పార్కులను అటవీ భూములని నిర్వచించింది.

మనకు రెండు అటవీ సెటిల్‌మెంట్ చట్టాలు వున్నాయి. అవి ఆంధ్రప్రదేశ్ అటవీ సెటిల్‌మెంట్ చట్టం 1967, భారత అటవీ -సెటిల్‌మెంట్-చట్టం 1924. మన రాష్ట్ర అటవీ సెటిల్‌మెంటుకు మాతృక 1882 మద్రాసు అటవీ చట్టం. దీని ప్రకారం మూడు రకాల అడవులు వున్నాయి. అవి 1. సెక్షన్ 4 కింద నోటిఫై చేసిన అడవులుగా మార్చటానికి ఉద్దేశించిన భూములు, 2. సెక్షన్ 15 కింద ప్రకటించిన రిజర్వు అడవులు, 3. సెక్షన్ 24 అనుసరించి ప్రకటించిన రక్షిత (ప్రొటెక్టు) అడవులు. అటవీ హక్కుల చట్టంలోని పైన తెలిపిన వాటిలో మొదటి రెండు రకాలు మనకు సంబంధించినంత వరకూ సెక్షన్ 4 కింద ప్రకటించిన డీమ్డ్ ఫారెస్టు భూములే. ఎందుకంటే అవే ఇంకా వర్గీకరణ (రిజర్వుడు) (ప్రొటెక్టెడు), పూర్తిస్థాయిలో సరిహద్దులు నిర్ధారించని భూములు.

చట్టంలోని అటవీ నివాస ఆదివాసీలు, అటవీ భూముల నిర్వచనాలను కలిపి చదివినప్పుడు పైన తెలిపిన మూడు రకాలకు చెందిన భూములలో ఆవాసాలు నిర్మించుకొని, వాటిపై జీవికకు ఆధారపడిన షెడ్యూల్డ్ తెగలు అని అర్థం చెప్పుకోవలసి వస్తుంది. అంటే అడవి లోపల నివశించకపోయినా, ఒకవేళ నివశిస్తూ దానిపై ఆధారపడని వారు హక్కులు పొందడానికి అర్హులు కారు. గిరిజన, గ్రామీణ, సంక్షేమ శాఖలు చట్టంలోని ప్రాథమికంగా (primarily) అనే పదాన్ని నొక్కి చెపుతూ, అడవులకు దగ్గిరగా నివశిస్తూ వాటిపై ఆధారపడిన వారు అనే అర్థం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. ఇదేదో భాష సమస్య కాదు, కొన్ని లక్షల కుటుంబాలకు సంబంధించిన సమస్య.

ఎన్నికలు సమీపిస్తుండటం, కొన్ని లక్షల ఎకరాలకు హక్కులు ఇచ్చిన ఘనత తమ ఖాతాలో అర్జెంటుగా వేసుకోవలసిన అవసరం రీత్యా చూసి చూడనట్లుగా పొందని అటవీ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుండి మౌఖిక ఆదేశాలు వుంటాయి. కాని దీర్ఘకాలంలో దీనిపై ఎవరైనా న్యాయపరమైన వివాదాన్ని లేవదీసే అవకాశం పుష్కలంగా వుంది. లేదా ఆ శాఖకు చెందిన అధికారులే ఎవరో ఒకర్ని ప్రోత్సహించనూ వచ్చు.

## రెండవ అధ్యాయం:

చట్టంలోని రెండవ అధ్యాయం అటవీ హక్కులను వివరిస్తుంది. మొత్తం 14 రకాల హక్కులు ఇచ్చారు. 2005 డిసెంబరు 13కు ముందు పునరావాసం కల్పించకుండా చట్ట విరుద్ధంగా నిర్వాశితుల్ని చేసి వుంటే ఈ చట్టం పునరావాసం, భూములను డిమాండు చేసే హక్కును గుర్తించింది.

కేంద్రంలో / రాష్ట్రంలో పునరావాసం ఒక హక్కుగానే కాదు, సాంప్రదాయంగా కూడా లేదు. రాష్ట్ర ప్రభుత్వం 2003లో ప్రకటించిన పునరావాస విధానం జి.ఓ. 68 ఒక సార్వత్రిక పునరావాసం కాదు. ఒక ప్రాజెక్టును దీని కింద ముందుగా నోటిఫై చేయవలసి వుంటుంది. చట్టబద్ధంకాని ఒక డిమాండును పూర్తి చేయకపోవడం చట్ట విరుద్ధం ఎలా అవుతుందో, దాన్ని బాధితులు ఎలా నిరూపించుకోవాలో తెలీదు. సెక్షన్ 3(2) అనుసరించి 14 రకాల సాముదాయక అవసరాలలో (ఉదాహరణకు పాఠశాల, ఆసుపత్రి, అంగన్‌వాడి వగైరా) ఒక్కొక్క అవసరానికి హెక్టారు (2.45 సెంట్ల) అటవీ భూమిని, 75 చెట్లకు పైబడి కూల్చకుండా వాడుకలోకి తెచ్చుకోవచ్చు.

## అధాయ్యం నాలుగు:

హక్కుల గుర్తింపు, పునరుద్ధరణల గురించి వివరిస్తుంది. ఈ చట్టం కింద వచ్చిన హక్కులు అనువంశికంగా అనుభవించాలేగాని అన్యాక్రాంతం చేయకూడదు. భార్యాభర్తలు ఇద్దరి పేర్లతోను హక్కులు లభిస్తాయి. ఈ చట్టం కింద విచారణ పూర్తి కానంతవరకు ఎవర్ని తొలగించ కూడదు. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం కోసం అటవీ భూముల నుండి

తొలగించవలసి వస్తే పునరావాస ప్యాకేజికి గ్రామసభ నుండి లిఖిత పూర్వక అనుమతి తీసుకోవాలి. ప్యాకేజి పూర్తి అయ్యేంతవరకు వారిని కదపడానికి వీలులేదు. ఆ విధంగా తీసుకున్న భూమిని ఇతర ప్రయోజనాలకు వాడే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. ఈ రకమైన రక్షణలు జాతీయ పార్కులు, వన్యమృగ సంరక్షణ కేంద్రాలకే పరిమితం చేశారు గాని, అటవీయేతర అవసరాలకు అటవీ భూములు మార్పిడి వచ్చేసరికి, ఉదాహరణకు పోలవరం వంటి ప్రాజెక్టులకు ఈ చట్టం రక్షణలు పనికిరావు.

అటవీ భూములపై హక్కులు కల్పించేటప్పుడు అటవీ చట్టం 69/80 అనుసరించి అటవీ భూములను ఇతర అవసరాలకు మళ్ళించేటప్పుడు చెల్లించవలసిన ప్రస్తుత నికర విలువ, మరో చోట అంతే అడవిని పెంచాలనే షరతుల నుండి ఈ చట్టానికి మినహాయింపు వుంది. ఒక కుటుంబానికి 4 హెక్టార్ల (10 ఎకరాల) వరకు అటవీ భూమికి హక్కులు పొందవచ్చు.

మరొక ముఖ్యమైన అంశం ఏమిటంటే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి ప్రాజెక్టుల కోసం నష్టపరిహారం ఇవ్వకుండా భూమి నుండి తొలగించి 5 సంవత్సరాలు గడిచినా ఆ భూమిని అందుకు ఉపయోగించని సందర్భంలో అట్టి భూములపై నిర్వాశితులకే హక్కులు వుంటాయని చట్టంలోని సెక్షన్ 4(8) చెపుతుంది.

## హక్కులు - అమలు బాధ్యతలు:

హక్కులు కాకుండా వాటిని పొందే వారికి చట్టం కొన్ని బాధ్యతలను నిర్దేశించింది. వన్యప్రాణులు, అడవులు, జీవ వైవిధ్యాన్ని రక్షించే చర్యలను గ్రామసభ చేపట్టవచ్చు. దుష్ట ప్రభావాల నుండి వీటిని రక్షించేందుకు గ్రామసభ చేసిన సూచనలను పాటించాలి.

సాధారణంగా హక్కులను ప్రజలు అడుగుతారు, అధికారులు తమ చేవ్రాలు రాజముద్ర వేసి వాటిని ఇస్తారు. భూమిపై హక్కులకు సంబంధించి ఇప్పటివరకూ మన రాష్ట్రంలో అమలు అయిన సెటిల్‌మెంట్ చట్టాలు ఈ విధంగానే హక్కులను 'మంజూరు' చేశాయి. అటవీ హక్కుల చట్టం, బహుశ చరిత్రలోనే మొదటిసారి ఈ ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేసింది. సెటిల్‌మెంట్ చట్టాలలో ప్రాథమిక విచారణ, ట్రిబ్యునల్స్ / సెటిల్‌మెంట్ ఆఫీసర్లు, ఇనాం డిప్యూటీ తాశీల్దార్లు చేసిన పనిని ఈ చట్టం ప్రకారం గ్రామసభలు నిర్వహిస్తాయి. సబ్ డివిజనల్, జిల్లా కమిటీలలో అధికారులు వున్నప్పటికీ వారితో సమానంగా ప్రజా ప్రతినిధులకూ స్థానం కల్పించడం ద్వారా ప్రజలకు పరోక్ష ప్రాతినిధ్యం లభించింది.



గ్రామసభ ద్వారా నియమితమైన అటవీ హక్కుల కమిటీ సర్వే సెటిల్‌మెంట్ విభాగంలా పని చేయవలసి వుంటుంది. దీనికి సాంకేతిక నైపుణ్యం, అవగాహన, విశ్లేషణ శక్తులు కావాలి. దురదృష్టవశాత్తూ ప్రజలకు ఇటువంటి శక్తి సామర్థ్యాలను ఇచ్చే వ్యవస్థలు మనకు లేవు. రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు వున్నా వాటికి అంత తీరిక, ఓపిక, ఆసక్తి లేదు. అరకొరగా వున్న కొన్ని పార్టీయేతర సంస్థలు/ సంఘాలు వున్న డిమాండును తీర్చలేవు. కాబట్టి విధిగా ప్రభుత్వ సంస్థలు, ఉద్యోగులపైనే ఆధారపడ వలసి వస్తోంది.

2008 జనవరి 1న ప్రకటితమైన హక్కుల చట్టం నియమాలు అటవీ హక్కుల కమిటీకి 5 రకాలైన బాధ్యతలు, కేసుల విచారణకు 9 రకాల మార్గదర్శకాలను, 9 రకాల సాక్ష్యాలను అందించింది. లిఖిత సాక్ష్యాలతో పాటు గ్రామపెద్దలు ఇచ్చే స్టేట్‌మెంట్లు, ప్రాచీన నిర్మాణాలు, భౌతిక గుర్తులను కూడా సాక్ష్యాలుగా గుర్తించే వీలుంది. క్లయింకు సంబంధించిన చిత్తుపటం తయారు, సాక్ష్యాల నమోదు, విచారణకు కమిటీ సభ్యులకు శిక్షణ, సేవలు అందుబాటు చాలా అవసరం. అందువల్ల భారాన్ని కేవలం అధికారుల మీదనే వదిలి వేయకుండా పౌర సమాజం ముందుకు రావలసి ఉంది. క్లయిందార్లు, వాటిని నిర్ధారించే వారు ప్రజల్లో భాగం. కాబట్టి వత్తిడుల తీవ్రతను కూడా వూహించాలి.



## అధ్యాయం ఆరు:

చట్టంలోని అధ్యాయం ఆరు సెక్షన్ 9 ప్రకారం అధ్యాయం 4లో తెచ్చిన వ్యవస్థలు అంటే గ్రామసభ (అందులో భాగమైన అటవీ హక్కుల కమిటీ), దాని సభ్యులు, సబ్ డివిజన్, జిల్లా స్థాయి కమిటీలు, కేంద్రం లేదా రాష్ట్ర పర్యవేక్షక సంఘాల సభ్యులు ఐపిసి సెక్షన్ 21 కింద పబ్లిక్ సర్వెంట్స్ అవుతారు. వివాదాస్పద క్లయిముదారుల కోర్టు కేసుల నుండి రక్షణకు దీన్ని ఉద్దేశించారు. సెటిల్‌మెంటు ప్రక్రియను నిర్వహించే అటవీ హక్కుల కమిటీ సేవా నిరతితో స్వచ్ఛందంగానే పని చేయాలని విధాన కర్తలు ఆశిస్తున్నారు. గ్రామ పంచాయితీ స్థాయి పాలన ప్రక్రియల ఖర్చును భరించడానికి ప్రభుత్వాలు ముందుకు రాకపోతే ఏమవుతుంది? ప్రభుత్వం వత్తిడి వున్నంత కాలం ఆ బరువు పంచాయితీ, రెవెన్యూ కార్యదర్శులు, రేషన్ షాపు డీలర్లకు బదిలీ అవుతుంది. దాని పర్యవసానాలు అందరికి తెలిసినవే.

1948 జమిందారీ రద్దు చట్టం తరువాత ఆంధ్రప్రదేశ్‌లో 1950-60 మధ్య ఒక సర్వే సెటిల్‌మెంట్ జరిగింది. అంతటి భారీస్థాయిలో జరగబోతున్న సెటిల్‌మెంట్ ఇది. అది కూడా ఏ హంగులు, వనరులు లేని అటవీ హక్కుల కమిటీలు, గ్రామసభలు నిర్వహించాలి. చట్టంలో ఆశించినట్లుగా పనులు జరగాలి అంటే అటవీ హక్కుల కమిటీలో కొందరైనా - కొంత కాలమైనా - పూర్తిస్థాయిలో పని చేయవలసి వుంటుంది. ఇందుకు వ్యవస్థాగతమైన ఏర్పాట్లు గురించి ప్రస్తావన లేదు.

క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలపై ఒక దుప్పటి కప్పేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'లేడికి లేచిందే పరుగు' అన్నట్లుగా అధికారులను పరుగులు పెట్టిస్తున్నాయి. ప్రధానమంత్రి 2008 జనవరి 8న లేఖ రాస్తే గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మణిశంకర్ అయ్యర్ ఫిబ్రవరి 15 లేఖ రాస్తూ దేశం అంతటా 28న అంటే 13 రోజులలోగా గ్రామసభలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ బిల్లు చట్టంగా మారిన తరువాత నిబంధనలను రూపొందించడానికి 2 సంవత్సరాల సమయం తీసుకున్నవారు, రేపు వచ్చే ఎన్నికలలోగా చట్టాన్ని అమలును పూర్తి చేసేయాలనుకుంటున్నారు. హక్కుల నిర్ధారణ, స్థిరీకరణను అధికార సోపానానికి పాచికలుగా భావిస్తే మొదటికే మోసం వస్తుంది!! ❏

కోనేరు కమిటీ సూచనల ఆమోదం/ చర్యలకు ప్రభుత్వం రెండు జిఓలను జారీ చేసింది.

జి.ఎం.ఎస్.నెం. 1049, తేది: 28.7.07, జి.ఓ.ఎం.ఎస్.నెం. 1191, తేది: 7.9.2007

ఈ జిఓ తెలుగు ప్రతులు వాసన్ - భూమి కేంద్రం ద్వారా పొందవచ్చు.

Book Post

To


**భూమి కేంద్రం**

**వాసన్**

12-13-450, వీధి నెంబరు 1, తార్నాక

సికింద్రాబాదు - 500017

ఫోన్: 040-27015295/27015296, 65284580

Email: wassan@eth.net, Website: www.wassan.org


for private circulation only